సాక్షి
మెదక్

శనివారం, 26, ఆగస్టు, 2023

వరలక్ష్మీ అవతారంలో దుర్గమ్మ

మండలంలోని ఏడుపాయలలో కొలువైన వనదుర్గ అమ్మవారు శుక్రవారం వరలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాల్లో పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్ ఈఓ సార శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- పాపన్నపేట(మెదక్)



న్యూస్‌రీల్

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లును ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల కార్యాలయాలు ఒకేచోట ఉండటంవల్ల ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఆయన వెంట మెదక్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, నాయకులు చింతల నర్సింహులు, లింగారెడ్డి, ముజీబ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు మీసేవ కేంద్రాల నిర్వాహకుల వినతి



కలెక్టరేట్ ముందు మీసేవ నిర్వాహకుల నిరసన

మెదక్ కలెక్టరేట్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీసేవ జేఏసీ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పదేళ్లుగా కమీషన్లు పెంచలేదన్నారు. షాపుల కిరాయి, కరెంట్, ఇంటర్‌నెట్ బిల్లులు, స్టేషనరీ ధరలు విపరీతంగా పెరగడంతో నిర్వహణ కష్టంగా ఉందన్నారు. కమీషన్లు పెంచకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పహాణీ నకలు, ఆర్‌ఓఆర్, 1బి మీసేవ నుంచి తొలగించారన్నారు. ప్రభుత్వం స్పందించి గతంలో ఇచ్చిన హామీ ప్రకారం కమీషన్లు పెంచాలని కోరారు. అలాగే మీసేవ నిర్వాహకులకు ఉచితంగా కరెంట్ ఇవ్వాలని, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు.

డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలి

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్

రామాయంపేట(మెదక్): ఈనెల 26వ తేదీన చేవెళ్లలో నిర్వహించనున్న దళిత, గిరిజన డిక్లరేషన్ సభకు జిల్లా వ్యాప్తంగా దళిత, గిరిజనులు తరలిరావాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన నార్సింగిలో విలేకరులతో మాట్లాడారు. దళిత, గిరిజనులకు బీఆర్ఎస్ చేస్తున్న మోసాలు ఈ సభ ద్వారా వెలుగులోకి తెస్తామన్నారు. సభకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. జిల్లా పరిధిలోని ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, అనుబంధ విభాగాలు, మహిళా ప్రతినిధులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

మెదక్ కలెక్టరేట్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌పై ఈనెల 28వ తేదీన సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ శుక్రవారం తెలిపారు. అక్టోబర్ చివరి వారంలో జిల్లా స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టుల గైడ్ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 28న మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ఉపాధ్యాయులకు ఉదయం 10 నుంచి 1 గంట వరకు, తూప్రాన్, నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ఉపాధ్యాయులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఒక సైన్సు టీచర్‌ను పంపాలని ఎంఈఓ, హెచ్ఎంలను ఆదేశించారు. మరింత సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డిని 83285 99157 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దరఖాస్తులను పరిష్కరించండి

మెదక్ కలెక్టరేట్: ధరణి పెండింగ్ దరఖాస్తులను, జీఓ 58, 59 పట్టాల పంపిణీ, గృహలక్ష్మీ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఆర్డీఓ, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు అంబదాస్ రాజేశ్వర్, జయచంద్ర రెడ్డి, ఎన్నికల సమన్వయకర్త రాజిరెడ్డి పాల్గొన్నారు.

పొరపాటు.. గ్రహపాటు

దానాతవ్ పుల్యా, కాత్రోత్ హరీ, కాత్రోత్ చందర్, మాలావత్ రెడ్యా, ధనావత్ భూలి, లంబాడి దూలి, చాకలి చంద్రకళ.. ఇలా చెప్పకుంటూపోతే బాధితుల లిస్టు చాంతాడంత అవుతుంది. వీరంతా రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలకు బలైన రైతులు. భూ రికార్డుల ప్రక్షాళనలో వీరి పేర్లను రికార్డుల్లో పొందుపర్చకపోవటంతో ధరణి పోర్టల్‌లో పేర్లు లేవు. ఆరేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమను పట్టించుకోవడం లేదంటున్నారు.

- భూ రికార్డుల ప్రక్షాళనలో పేర్ల తొలగింపు
- అధికారుల తప్పిదాలకు రైతులు బలి
- ఆరేళ్లుగా అందని రైతుబంధు
- నిత్యం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ



ధరణి భూ బాధితులు

మెదక్: జిల్లాలోని చాలా మండలాల్లో భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం రైతుల భూములు రికార్డు నుంచి తొలగించబడ్డాయి. చిన్నశంకరంపేట మండలం జంగారాయి శివారులోని ఎర్రగుంట తండా, కొయ్యగుండు, సర్వనితండా, జంగారాయి శివారులో 270/364/406 సర్వే నంబర్లలో అబ్దుల్ ఖాదర్ పేరుపై 500 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని కొన్నేళ్లుగా సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు అక్కడి రైతులు. 2017లో భూ రికార్డుల ప్రక్షాళన చేసిన రెవెన్యూ అధికారులు మూడు సర్వే నంబర్లకు బదులు ఒకే సర్వే నంబర్‌ను సృష్టించి ధరణిలో పొందుపర్చారు. ఈ క్రమంలో చాలా మంది రైతుల పేర్లను క్షేత్రస్థాయి అధికారులు నమోదు చేయలేదు. ఫలితంగా ఆరేళ్లుగా బాధితులు రైతుబంధుకు దూరమవుతున్నారు. తమ భూములను తిరిగి రికార్డుల్లో ఎక్కించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. మామూళ్లు సమర్పించిన వారి పేర్లు మాత్రం రికార్డుల్లో ఎక్కిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జంగారాయికి చెందిన ఓ రైతుకు చెందిన 4 ఎకరా లు రికార్డుల్లో నమోదు చేయకపోవటంతో రూ.50 వేలు ఇవ్వటంతో తిరిగి ఎక్కించినట్లు తెలిసింది.

భూమి ఒకరిది.. పట్టా మరొకరికి..

- మెదక్ మండలం రాజ్‌పల్లికి చెందిన శ్రీపతి రాధమ్మకు గ్రామ శివారులోని 556 సర్వే నంబర్‌లో 1.11 గుంటల పట్టా భూమి ఉంది. 2017లో ధరణిలో పొందుపర్చే సమయంలో కేవలం 1.1గా నమోదు చేశారు. మిగతా 10 గుంటల భూమిని పక్క పొలం రైతు పేరున నమోదు చేశారు. నాటి నుంచి రైతు రాధమ్మ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది.
- మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన మహిపాల్‌రెడ్డికి తూప్రాన్ మండల పరిధిలోని ఇస్లాంపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 50లో 4.34 ఎకరాల భూమి ఉంది. భూ ప్రక్షాళనలో సర్వే చేసిన అధికారులు పక్క పొలానికి చెందిన మహిళా రైతు పేరుపై నమోదు చేశారు. సదరు బాధిత రైతు అనేక మార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయాడు.

కొత్త సమస్యలు

ఓ రైతు భూమిని మరొక రైతు పేరుతో ధరణిలో పొందుపర్చిన అధికారులు మళ్లీ ఆ భూమిని అసలు రైతు పేరున ఎక్కించలేని పరిస్థితి. ధరణి రాకముందు సమస్య వస్తే వెంటనే పరిష్కరించేవారు. ప్రస్తుతం కొత్త సమస్యలు సృష్టించుకున్నట్లయ్యింది. ధరణిలో పేరు మార్చాలంటే ఇతరుల పేరుపై నమోదు చేసిన వారి నుంచి కొనుగోలు చేస్తున్నట్లు మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలి. దీంతో సదరు రైతు తిరిగి హక్కుదారుడుకి ఇవ్వడానికి నిరాకరిస్తున్నాడు. తన పేరిట నమోదైన భూమిపై వచ్చే రైతుబంధు తీసుకుంటున్నాడు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఆరేళ్లుగా తిరుగుతున్నా



నాకు నాలుగు ఎకరాలు ఉంది. ఆరేళ్ల క్రితం భూమిని సర్వే చేశారు. రికార్డుల్లో ఎక్కిస్తామని చెప్పి ఎక్కించలేదు. అప్పటి నుంచి నిత్యం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. నాకు రైతుబంధు వస్తలేదు.

- ధనావత్ పూల్‌సింగ్, రైతు, జంగారాయితండా

రైతుబంధు రావడంలేదు



నాకు మూడు ఎకరాలు ఉంది. దీనిపై గతంలో బ్యాంకు నుంచి పంట రుణం తీసుకున్నా. సర్వేచేసిన అధికారులు రికార్డుల్లో ఎక్కించడంలేదు. ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవటం లేదు. దీంతో రైతుబంధు రావటం లేదు. అంతేకాకుండా బ్యాంకులో పంట రుణం తీసుకోలేని పరిస్థితి.

- మాలోత్ రెడ్యా, నాగులమ్మతండా జంగారాయి

దరఖాస్తు చేసుకోవాలి

భూ రికార్డుల ప్రక్షాళనలో జరిగిన తప్పులకు సంబంధించిన సమస్యలపై రైతులు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. మీ సేవలో ఆప్షన్ లేకుంటే ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

- అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీఓ, మెదక్

ఎన్నికల విధులకు సిద్ధం కావాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల విధులకు అధికారులు సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. ఇందులో ఆర్ఓ, ఏఈఆర్, సెక్టార్ అధికారుల పాత్రలు కీలమన్నారు. జిల్లాలో మెదక్ 31, నర్సాపూర్ 33 సెక్టార్ అధికారులను నియమించామని, మరో ఆరుగురు అదనపు సెక్టార్ అధికారులను అందుబాటులో ఉంచామన్నారు. సామాన్య ప్రజలతోపాటు వీఐపీ, ఓటర్ల పేర్లు గల్లంతుకాకుండా చూడాలన్నారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు పొందాలన్నారు. జిల్లాలో 579 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఓటరు జాబితా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు అంబదాస్ రాజేశ్వర్, జయచంద్రారెడ్డి, ఎన్నికల సమన్వయకర్త రాజిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మేరామిట్టీ.. మేరాదేశ్‌కు మట్టి సేకరణ

మెదక్ కలెక్టరేట్: ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన మేరా మిట్టీ.. మేరాదేశ్‌కు శుక్రవారం మెదక్ నూతన కలెక్టరేట్ ప్రాంగణంలోని మట్టి సేకరించారు. తెలంగాణ స్టేట్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆదేశానుసారం జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిటీ ఆధ్వర్యంలో మట్టిని సేకరించి స్టేట్ హెడ్‌క్వార్టర్‌కు పంపించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, జిల్లా కార్యదర్శి రాజేందర్, జిల్లా ట్రైనింగ్ కమిషనర్స్ మహిపాల్, గైడ్ కెప్టెన్ జోత్స్నపాల్గొన్నారు.

పోచారం అభయారణ్యం సందర్శన

హవేళీఘనపూర్: పోచారం అభయారణ్యం వన విజ్ఞాన కేంద్రాన్ని యూఎస్ ఎస్ఐడీ డైరెక్టర్ అలెజ్జేండ్రియా బృందం శుక్రవారం సందర్శించింది. వన విజ్ఞాన కేంద్రంలో వన్యప్రాణుల సంరక్షణ గురించి తెలుసుకున్నారు. ఈ కేంద్రం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అటవీ శాఖ అధికారులు వారికి వివరించారు. అనంతరం సఫారీ వాహనంలో తిరుగుతూ అభయారణ్యంలోని జంతువులను వీక్షించారు. పక్షులకు అందించే ఆహారం, తాగునీటి వసతి కోసం నిర్మించిన చెక్‌డ్యామ్, సోలార్‌తో నడిపే మోటార్‌ను పరిశీలించారు. అభయారణ్యం సందర్శించిన వారిలో బృందం సభ్యులు అలెజ్జేండ్రియా, షూట్రియస్, హైదరాబాద్ ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణ అధికారి లోకేశ్‌జైస్వాల్, సీసీఎఫ్ శరవణన్, జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్, డీఎఫ్ఓ రవిప్రసాద్, ఎఫ్ఆర్వో మనోజ్‌కుమార్, ఫారెస్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.



విజ్ఞాన కేంద్రంలో యూఎస్ ఎస్ఐడీ బృందం

సీఎంను కలిసిన మదన్‌రెడ్డి

నర్సాపూర్ : నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి శుక్రవారం సీఎం కేసీఆర్‌ను కలిశారు. హైదరాబాద్‌లో సచివాలయంలో సీఎం చాంబర్‌లో నర్సాపూర్ నియోజకవర్గ పలువురు ముఖ్యనేతలతోపాటు కలిశారు. అక్కడే మంత్రి టి.హరీశ్‌రావు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 115 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒక్క నర్సాపూర్ నియోజకవర్గ అభ్యర్థి ఎవరో ఖరారు చేయలేదు. ఈ నేపథ్యంలో ఆయన సీఎంను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే టిక్కెట్టు విషయం ఎలాంటి ప్రస్తావనకు రాలేదని బీఆర్ఎస్ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. మదన్‌రెడ్డి వెంట రాష్ట్ర అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ ఉమ్మన్నగారి దేవేందర్‌రెడ్డి ఉన్నారు. కాగా గురువారం మంత్రి హరీష్‌రావు ఇంటికి వెళ్లిన విషయం విదితమే. మరోవైపు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి కూడా ఈ టిక్కెట్ విషయమై తన ప్రయత్నాల్లో ఉన్నారు.

బీజేపీ కార్యాలయాలు ప్రారంభం

రామాయంపేట(మెదక్): రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా బీజేపీ ఎన్నికల కార్యాలయాలను ఏర్పాటు చేస్తోంది. పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని కర్ణాటక రాష్ట్రం ఉడిపీ ఎమ్మెల్యే సురేశ్‌షెట్టి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, నల్లాల విజయ్, జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయకుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉదయ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోచమ్మల అశ్విని, అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్, పార్టీ రామాయంపేట, నిజాంపేట మండలాల అధ్యక్షులు శంకర్‌గౌడ్, చంద్రశేఖర్, మండల కన్వీనర్ దయానందరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచరణ్‌యాదవ్ పాల్గొన్నారు.

హవేళీఘనపూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలకు బీఆర్ఎస్ రంగుపూసి తామే అభివృద్ధి చేశామంటూ ప్రచారం చేస్తూ కాలంగడుపుతున్న బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కర్ణాటక రాష్ట్ర ఉడిపీ ఎమ్మెల్యే సురేశ్‌శెట్టి అన్నారు. శుక్రవారం హవేళీఘనపూర్‌లోకార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర పథకాలను బీఆర్ఎస్ తమ పథకాలంటూ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.



రామాయంపేటలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉడిపీ ఎమ్మెల్యే సురేశ్‌శెట్టి

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- పార్టీ పిలుపు మేరకు ర్యాలీగా వచ్చిన నాయకులు
- కమాన్ వద్ద అడ్డుకున్న పోలీసులు
- కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లిన ఆందోళనకారులు
- అదుపులోకి తీసుకొని అనంతరం విడుదల



ప్రధాన గేటు ముందు బైఠాయించిన బీజేపీ నాయకులు

మెదక్ కలెక్టరేట్: అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నిర్వహించిన మెదక్ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివచ్చిన నాయకులను పోలీసులు కమాన్ వద్ద అడ్డుకున్నారు. వారి నుంచి తప్పించుకొని లోపలికి పరుగులు పెట్టారు. ప్రధాన గేట్లు మూసివేయడంతో గేట్లు తెరిచేందుకు విఫల యత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకులకు మధ్య పెనుగులాట జరిగింది. గేటు వద్ద మోహరించిన పోలీసులు వారిని లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బీజేపీ నాయకులు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. నలుగురు నాయకులు కలెక్టర్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. దీంతో వారిని పట్టుకొని వచ్చేందుకు పోలీసులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఎట్టకేలకు వారిని పట్టుకొని పోలీసు జీపులో ఎక్కించారు. అరెస్ట్‌చేస్తే అందరినీ చేయాలంటూ పోలీసు జీపు ముందు మిగతా వారు బైఠాయించారు. దీంతో డీఎస్పీ ఫణీంద్ర, పోలీసులు కలెక్టరేట్ ముందు మోహరించారు. ఈ సందర్భంగా నాయిని ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడి చేపట్టామన్నారు. అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు దళిత బంధు, గృహలక్ష్మి, బీసీలకు రూ.లక్ష సాయం అందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులను అడ్డుకోలేక పోయిన పోలీసులు కవరేజికి వెళ్లిన పాత్రికేయులపై అసహనం వ్యక్తం చేయడంతో వాగ్వాదం జరిగింది. అదుపులోకి తీసుకున్న బీజేపీ నాయకులను హవేళిఘణాపూర్, మెదక్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. రెండు గంటల అనంతరం వారిని వదిలిపెట్టారు. ఇక వివిధ పనులపై కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు నానా అవస్థలుపడ్డారు. గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే పోలీసులు లోనికి అనుమతించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మధు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉదయ్, కౌన్సిలర్ నిఖిల్, నాయకులు శివ, సతీష్, సంతోష్, ప్రభాకర్, వీణ, సంగీత, రాజు, రాహుల్, బబ్లూ పాల్గొన్నారు.



రామాయంపేటలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఇతర నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

బీజేపీ నేతల గృహనిర్బంధం

రామాయంపేట(మెదక్): చలో కలెక్టరేట్ కార్యక్రమానికి తరలివెళుతున్నారనే సమాచారంతో శుక్రవారం పోలీసులు రామాయంపేటలో సమావేశమైన కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపీ ఎమ్మెల్యే సురేశ్‌శెట్టి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఇతర జిల్లా నాయకులు, కార్యకర్తలను రెండు గంటలపాటు హౌస్ అరెస్ట్ చేసి అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో కార్యకర్తలు పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. అక్కడికి సీఐ లక్ష్మీబాబు, పోలీసులు వచ్చి హాల్ గేట్లు మూసివేసి తాళాలు వేశారు. దీంతో ఆగ్రహించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు రామాయంపేట–మెదక్ రోడ్డుకు అడ్డంగా బైఠాయించి రాస్తారోకో చేశారు. పోలీసులు వారిని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. ఆందోళనలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, నల్లాల విజయ్, జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు శంకర్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నశంకరంపేట పోలీస్‌లు కలెక్టరేట్‌కు తరలివెళ్లకుండా ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

చెరువులో పడి వృద్ధురాలు మృతి

కొండపాక(గజ్వేల్‌): మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు చెరువులో పడి మృతి చెందిన సంఘటన కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దండుగుల ఎల్లవ్వ (75) కుమారుడు కొన్ని నెలల క్రితం మృతి చెందాడు. దీంతో ఆమె మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతుండేది. ఈనెల 23న ఇంటి నుంచి వెళ్లిన వృద్ధురాలు శుక్రవారం వరకు తిరిగి రాలేదు. గ్రామ చెరువులో మహిళ శవం ఉందని తెలియడంతో కుటుంబీకులు వెళ్లి చూశారు. చనిపోయింది ఎల్లవ్వగా గుర్తించి మనుమడు భాస్కర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్‌ సీఐ భానుప్రకాశ్‌ తెలిపారు.

గుర్తు తెలియని యువకుని శవం లభ్యం



రైలు పట్టాల పక్కన పడి ఉన్న మృతదేహం

మనోహరాబాద్‌(తూప్రాన్‌): మండలంలోని లింగారెడ్డిపేట్‌ గ్రామ శివారులో రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని యువకుడి (30)శవం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. రైల్వే కామారెడ్డి ఎస్‌ఐ తావునాయక్‌ తెలిపిన వివరాలు. మృతదేహం వద్ద దానాపూర్‌ నుంచి సికింద్రాబాద్‌ వరకు రైల్వే టిక్కెట్‌ ఉన్నట్లు గుర్తించారు. అయితే రైలులో నుంచి పడిపోయాడా, ఎవరైనా తోసేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



దేవయ్య

దుబ్బాకరూరల్‌: మండలంలోని రఘోత్తంపల్లి గ్రామంలో వ్యక్తి అదృశ్యం కేసు నమోదైంది. సీఐ కృష్ణ వివరాలు. గ్రామానికి చెందిన కంతుల దేవయ్య(50) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఈనెల 22న మండలంలోని ధర్మాజీపేటలోని బంధువుల దగ్గరికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. అదేరోజు రాత్రి అతని కుమారుడు బంధువులకు ఫోన్‌ చేసి ఆరా తీయగా రాలేదని వారు చెప్పారు. దీంతో కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం దేవయ్య కుమారుడు నవీన్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న డీఏఓ గోవింద్‌

నిజాంపేట(మెదక్‌): మండలంలోని నార్లాపూర్‌ గ్రామంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌ వరి పంటలను పరిశీలించారు. ఈమేరకు వరిలో మొగి పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున దాని నివారణకు ఎకరాకు కార్తాప్‌ హైడ్రోక్లోరైడ్‌ 400గ్రాములు లేదా క్లోరాంత్రనిలిప్రోల్‌ 60మిల్లీ లీటర్ల మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా యూరియా దఫాలుగా వాడుకోవాలని తెలియజేశారు. ఆలస్యంగా నాట్లు వేసేవారు వరి కొనలను తుంచుకొని దగ్గరగా నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సతీశ్‌, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, దశరథం, రామచంద్రం, లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఉసురు తీస్తున్న క్షణికావేశం



జీవితంలో తిరిగి పొందలేనివి రెండే రెండు. ఒకటి కాలం.. మరొకటి ప్రాణం. ఉరుకుల పరుగుల జీవనంలో చాలామంది క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చిన్నాచితక కారణాలతో తనువు చాలిస్తున్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉందనే విషయాన్ని మరిచి బలవన్మరణానికి పాల్పడి వారి కుటుంబ సభ్యులకు తీరని క్షోభను మిగుల్చుతున్నారు.

- ఒత్తిళ్లతో చిత్తవుతూ ఆత్మహత్యలు
- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న సంఖ్య
- ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలే కారణం

పటాన్‌చెరు టౌన్‌: జిల్లాలో అనేక కారణాల వల్ల పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, భార్య కాపురానికి రావడం లేదని, అనారోగ్య సమస్యలు, అప్పుల బాధలు నేపథ్యంలో రోజురోజుకు బలవన్మరణాలు పెరుగుతున్నాయి. అదేవిధంగా పలువురు మద్యంతో పాటు మాదక ద్రవ్యాలకు బానిసలై తనువు చాలిస్తున్నారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. సమస్యల పరిష్కారానికి ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్న వారికి స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా మానసిక ఒత్తిడిలను అధిగమిస్తేనే ఆత్మహత్యలను నియంత్రణ సాధ్యమవుతుందని వైద్యులు అంటున్నారు.



మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు, పక్కనే బీడీఎల్‌ పోలీసులు (ఫైల్‌)

ఈ ఏడాది జనవరి నుంచి జూన్‌ వరకు...

సంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్‌ వరకు 169 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. వారిలో 25 మంది మహిళలు, 144 మంది పురుషులు ఉన్నారు.

ప్రాణాలు తీసుకోవద్దు



చిన్న సమస్యలకు కూడా చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవడం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇటువంటి వారి కోసం ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహించి ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తాం.

– పురుషోత్తంరెడ్డి, డీఎస్పీ, పటాన్‌చెరు

ఒత్తిడిని అధిగమించాలి



మానసిక ఒత్తిడిలను అధిగమిస్తేనే ఆత్మహత్యలను నియంత్రించవచ్చు. ఏ పరిస్థితిలోనూ మనోవేదనకు గురికాకూడదు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. ప్రభుత్వం తరఫున కూడా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్‌ వసుంధర, పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌

ఇటీవల జరిగిన ఘటనలు

- అమీన్‌పూర్‌ మండలం ఐలాపూర్‌ పెద్ద తండాకు చెందిన కిషన్‌(37) లారీ డ్రైవర్‌. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. ఆరు నెలల క్రితం భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో ఆమె పిల్లలను తీసుకొని మియాపూర్‌లోని తల్లిగారిఇంటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి మద్యానికి బానిసైన కిషన్‌ మనస్తాపంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.
- పటాన్‌చెరు పట్టణం శ్రీరామ్‌నగర్‌ కాలనీలోని పద్మావతి అపార్ట్‌మెంట్స్‌లో భార్యాభర్తలు ఆనంద్‌ బాబు, సునీత నివాసం ఉంటున్నారు. సునీతకు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

మానసిక వేదనతో..

మనోహరాబాద్‌(తూప్రాన్‌): చేతికి వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం, చోరీ స్క్రాబ్‌ కొనగోలుతో మరో కుమారుడు జైలుకు వెళ్లడంతో మానసిక వేదనకు గురైన ఓ తండ్రి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిన ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట్‌ జిల్లా రాయపోల్‌ మండల కేంద్రానికి చెందిన గుమ్మడిదల బాలచంద్రం (50) కొన్నేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి మనోహరాబాద్‌ మండలం కాళ్ళకల్‌ గ్రామానికి వచ్చారు. అక్కడ స్క్రాబ్‌ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. మూడు నెలల క్రితం బాలచంద్రం చిన్న కుమారుడు సురేష్‌ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రెండు నెలల క్రితం పెద్ద కుమారుడు రమేష్‌ చోరీ సొత్తు కొనుగోలు కేసులో నిజామాబాద్‌ జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆర్థిక పరిస్థితులు వెన్నంటాయి. దీంతో మానసిక వేదనకు గురైన బాలచంద్రం ఇంట్లోంచి బయటకు వెళ్లి ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా చెట్టు మీద నుంచి శవాన్ని దించడానికి ఎవరులేక పోవడంతో ఎస్‌ఐ స్వయంగా తన సిబ్బందితో కలిసి సాయం పట్టారు. మృతుడి భార్య భూదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి బానిసై..

పటాన్‌చెరు టౌన్‌: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. రేగోడు మండలం ఉసరేకపల్లికి చెందిన మహేష్‌(30) భార్య రవళితో కలిసి పటాన్‌చెరులోని గోకుల్‌నగర్‌లో ఉంటున్నాడు. ఓ ప్రైవేట్‌ కంపెనీలో వారు పని చేస్తుంటారు. కొంతకాలంగా మహేష్‌కు పనిలేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తి మద్యానికి బానిసయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై భార్య డ్యూటీకి వెళ్లగానే ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దేవుళ్లనూ వదల్లేదు!

- దేవాలయంలో విగ్రహాలు మాయం
- రూ.2లక్షల సొత్తు మాయం



కొండాపూర్‌ ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని పగులగొట్టిన దొంగలు

జిన్నారం(పటాన్‌చెరు): మనుషులనే కాదు.. దొంగలు ఏకంగా దేవుళ్లను కూడా ఎత్తుకుపోతున్నారు. జిన్నారం మండలం అండూర్‌ గ్రామంలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం పూజలు నిర్వహించేందుకు వచ్చిన అర్చకులు ఆలయంలో దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సర్పంచ్‌ ఖదీర్‌, సీఐ వేణుకుమార్‌, ఎస్‌ఐ విజయారావు ఆలయాన్ని సందర్శించి క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించారు. మూడు ఉత్సవ విగ్రహాలు, అమ్మవారి పుస్తెమెట్టెలు, స్వామివారి కిరీటం, బంగారు ఆభరణాలు మాయమైనట్లు నిర్వాహకులు తెలిపారు. హుండీని పగులగొట్టి నగదును అపహరించినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందన్నారు. నిర్వాహకులు, గ్రామ పెద్దల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొండాపూర్‌ గ్రామంలో..

మద్దూరు(హుస్నాబాద్‌): మండలంలోని కొండాపూర్‌ గ్రామంలోని ఆంజనేయస్వామి, గట్టు మల్లన్న ఆలయాల్లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని పగలగొట్టి నగదును ఎత్తికెళ్లినట్లు చెప్పారు. గట్టు మల్లన్న ఆలయంలో ముఖ ద్వారం తాళాలను పగలగొట్టారు. హుండీలో నగదును చోరీకి యత్నించి విఫలమయ్యారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరణంలోనూ వీడని స్నేహం



శ్రీరాంబాబు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- బైక్‌పై వెళ్తుండగా టిప్పర్‌ ఢీకొని స్నేహితుల దుర్మరణం
- రెండు గ్రామాల్లో విషాదం
- పరామర్శించిన ప్రజాప్రతినిధులు



విశాల్‌సింగ్‌ (ఫైల్‌)



శ్రీరామ్‌ బాబు(ఫైల్‌)

మర్కూక్‌(గజ్వేల్‌): కలిసి చదువుకున్నారు.. కలకాలం స్నేహంగా ఉండాలనుకున్నారు.. కానీ టిప్పర్‌ రూపంలో మృత్యువు ఆ ఇద్దరిని కబళించింది. గురువారం రాత్రి చికెన్‌ తెచ్చేందుకు బైక్‌ మీద వెళ్లిన ఆ ఇద్దరు స్నేహితులను టిప్పర్‌ ఢీకొనడంతో దుర్మరణం చెందారు. దీంతో వారి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మర్కూక్‌ మండలం గంగపూర్‌కు చెందిన జుగరాజు విశాల్‌సింగ్‌, యూసుఫ్‌ఖాన్‌ పల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్‌బాబు ఇద్దరు బాల్యం నుంచి పదో తరగతి వరకు ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఆ తర్వాత విశాల్‌సింగ్‌ ఓ ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఇతనికి నెలక్రితం పాప పుట్టి మృతి చెందింది. అటు పాప.. ఇటు భర్త మృతి చెందడంతో విశాల్‌సింగ్‌ భార్య రోదనలు మిన్నంటాయి. శ్రీరామ్‌బాబు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇతనికి రెండు నెలల క్రితం కుమారుడు జన్మించాడు. ఆ సంతోషం తీరక ముందే కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. ఇద్దరి స్నేహితుల మృతితో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వారి మృతికి సంతాపంగా గణేష్‌పల్లి నుంచి గంగాపూర్‌ వరకు స్నేహితులు బైక్‌ ర్యాలీ నిర్వహించి వీడ్కోలు పలికారు. అంతకుముందు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి గజ్వేల్‌లో మార్చురీలో ఉన్న మృతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

తెలంగాణ తిరుపతిగా దుబ్బాక బాలాజీ



జడ్జి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

- హైకోర్టు జడ్జి సీవీ భాస్కర్‌రెడ్డి

దుబ్బాకటౌన్‌ : తెలంగాణ తిరుపతిగా అనతికాలంలోనే దుబ్బాక బాలాజీ ఆలయం ప్రసిద్ధిగాంచిందని హైకోర్టు జడ్జి సీవీ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం కుటుంబసమేతంగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. అనంతరం ఆయన మాట్లాడుతు ఆలయంలో కొలువైన బాలాజీ మహిమాన్వితుడని, కోరిన కోర్కెలు తీర్చుతాడని తెలిపారు. కార్యక్రమంలో ఆలయం చైర్మన్‌ వడ్లకొండ శ్రీధర్‌, చింత రాజు, రొట్టె రాజమౌళి, పల్ల శ్రీనివాస్‌, ఆకుల దేవేందర్‌ ఉన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో శాంతిపాఠం, వేద విన్నపం, తోరణ పూజ, మూర్తి కుంభ ఆరాధన, నిత్య హోమం, మూలమంత్ర హోమం, నిత్య పూర్ణాహుతి, బలిహారణం నిర్వహించారు. సుహాసినులచే కుంకుమార్చన జరిపించారు.

ఆయిల్‌పామ్‌ సాగు విస్తీర్ణం పెంచాలి



పామ్‌ఆయిల్‌ను పరిశీలిస్తున్న రైతులు

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్‌ సాగులో అశ్వరావ్‌పేటను ఆదర్శంగా తీసుకొని నంగునూరు మండలంలో సాగు విస్తీర్ణం పెంచాలని మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్‌పామ్‌ ఫార్మర్స్‌ ఫెడరేషన్‌ ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రైతులతో కలిసి ఆయిల్‌పామ్‌ తోటలు, ఫ్యాక్టరీని వారు సందర్శించారు. కాయల నుంచి నూనె తయారీ విధానం, గుజ్జు, గింజల వినియోగం తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మొక్కల సంరక్షణ, సాగు విధానం, డ్రిప్‌, ఎరువులు, పురుగు మందుల వాడకం, మట్టలు కొట్టివేయడం, గెలలు తెంపే విధానాన్ని తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నంగునూరు మండలం నర్మేటలో ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేసేలోపు ఆయిల్‌పామ్‌ సాగు విస్తీర్ణం పెంచేందుకు మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సారయ్య, రమేశ్‌గౌడ్‌, వెంకట్‌రెడ్డి, బాలపోచయ్య, రాజుగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును మరోవారం పొడిగించినట్లు ప్రిన్సిపాల్‌ డి.రాజేందర్‌ తెలిపారు. ఈ నెల 25తో గడువు ముగియాల్సి ఉండగా 31వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అవకాశాన్ని ఉమ్మడి మెదక్‌ జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొల్గూరు వాసికి డాక్టరేట్‌



డాక్టరేట్‌ను అందుకుంటున్న ప్రభు

గజ్వేల్‌రూరల్‌: నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత విద్యనభ్యసించి డాక్టరేట్‌ పట్టాను పొందాడు. గజ్వేల్‌ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన వడ్డేపల్లి రాధ, పెంటయ్యల కుమారుడు వడ్డేపల్లి ప్రభు ప్రస్తుతం బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. చిన్నప్పటి నుంచి ఏదైనా సాధించాలనే పట్టుదలతో ఉండే అతను కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలని జంతుశాస్త్రం విభాగంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొనాడ్‌ యూనివర్సిటీలో పీహెచ్‌డీలో చేరి డాక్టర్‌ కపిల్‌కుమార్‌ పర్యవేక్షణలో 'పర్యావరణంలో సంభవించే మార్పులు, కార్బన్‌ వలయం, ప్రవాలాల అవరోధాలపై వాతావరణ ప్రభావం' అనే అంశంపై జరిపిన అధ్యయనానికి డాక్టరేట్‌ను పొందాడు. ఈ సందర్భంగా ఆ యూనివర్సిటీ డైరెక్టర్‌ డాక్టర్‌ సుల్తాన్‌సింగ్‌ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నాడు. శుక్రవారం ప్రభు మాట్లాడుతూ తాను చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ లభించడం సంతోషంగా ఉందన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న పోలీసు అధికారులు

- సిద్దిపేట సీపీ శ్వేత



యోగాసనంలో సీపీ శ్వేత

సిద్దిపేట కమాన్‌: క్రమం తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులు కావచ్చని సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ ఎస్‌. శ్వేత తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్‌ కన్వెన్షన్‌ సెంటర్‌లో పోలీస్‌ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు చొరవతో పోలీస్‌ ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్‌ అధికారులు, సిబ్బందికి హెల్త్‌ చెకప్‌ చేయించి పలు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిపోర్టుల ఆధారంగా చాలామందికి స్థూలకాయం, బీపీ, షుగర్‌, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. వారి ఆరోగ్య పరిరక్షణ కోసం వాకింగ్‌, రన్నింగ్‌, స్విమ్మింగ్‌ చేయలేని వారికి వారానికి నాలుగు రోజులు, 60 రోజుల పాటు సిద్దిపేట పోలీస్‌ కన్వెన్షన్‌ సెంటర్లో యోగా ట్రైనర్‌ అశోక్‌ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీసీపీ లా అండ్‌ ఆర్డర్‌ మల్లారెడ్డి, ఏఆర్‌ అడిషనల్‌ డీసీపీ సుభాష్‌ చంద్రబోస్‌, త్రీటౌన్‌ సీఐ భానుప్రకాష్‌, పోలీస్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తం

సైబర్‌ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ ఎస్‌.శ్వేత సూచించారు. శుక్రవారం జరిగిన పలు సైబర్‌ మోసాల గురించి తెలిపారు. ఓ వ్యక్తికి పార్ట్‌ టైం ఉద్యోగం కోసం మెసేజ్‌ లింక్‌ ఓపెన్‌ చేసి రూ.3,76,776 పోగొట్టుకున్నాడు. ఇదే తరహాలో త్రీ టౌన్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో ఓ వ్యక్తి రూ.35,000 పంపించి మోసపోయాడు. వన్‌ టౌన్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో ఓ వ్యక్తి నుంచి పాన్‌కార్డ్‌ అప్‌డేట్‌ పేరిట రూ.24,150 దోచుకున్నారు. అదేవిధంగా రాజగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తిని జియో ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేసుకొని అతని ఖాతా నుంచి రూ.6,602 కాజేశారు.

అందుబాటులో ఉండాలి

మద్దూరు(హుస్నాబాద్‌): పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సీపీ శ్వేత అన్నారు. శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా మద్దూరు, చేర్యాల సర్కిల్‌ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌ స్టేషన్‌ పరిసరాలను పరిశీలించారు. 5ఎస్‌ ఇంప్లిమెంటేషన్‌ను పరిశీలించి ఫైలు సక్రమైన పద్ధతిలో ఉంచాలని సూచించారు. అలాగే నామినల్‌ రోల్స్‌ పరిశీలించి హెచ్‌ఆర్‌ఎంఎస్‌ తనిఖీ చేశారు. కార్యక్రమంలో హుస్నాబాద్‌ ఏసీపీ సతీష్‌, సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, ఏఎస్‌ఐలు విజయ్‌కుమార్‌, జగదీశ్వర్‌ తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌ నుంచి పోటీ : పొన్నం



పూజలు చేస్తున్న పొన్నం ప్రభాకర్‌

హుస్నాబాద్‌: హుస్నాబాద్‌ నియోజకవర్గం వెనుకబాటుకు, నిర్లక్ష్యానికి గురైందని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిద్ధేశ్వర, సంతోషిమాత, ఎల్లమ్మ, పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర స్వామి, కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుస్నాబాద్‌ కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, ప్రజల సహకారంతో ముందుకు వెళ్తానని తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ జెండా ఎగరాలని అన్నారు. అనంతరం పార్టీ టికెట్‌ కోసం దరఖాస్తు చేసుకునేందుకు పొన్నం ప్రభాకర్‌ గాంధీభవన్‌కు వెళ్లారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, డీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్‌, ఎండీ హుస్సేన్‌, నాయకులు పున్న సది, వెంకటరమణ, అయిత శ్రీధర్‌, మర్యాల రాజిరెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌ అభ్యర్థి కోసం దరఖాస్తులు

హుస్నాబాద్‌ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు గాంధీభవన్‌లో ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం చివరి గడువు కావడంతో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ తరఫున టీపీసీసీ జనరల్‌ సెక్రటరీ సత్తు మల్లేశం దరఖాస్తు అందించాడు. అలాగే సింగిల్‌ విండో అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్‌ నాయకుడు, అడ్వకేట్‌ ఒంటెల రత్నాకర్‌ కూడా దరఖాస్తులు సమర్పించారు.

కుంట కట్టను ధ్వంసం చేసిన వారిపై ఫిర్యాదు

దుబ్బాకరూరల్‌: కుంట కట్టను ధ్వంసం చేసి కబ్జా చేసిన వారిపై ఇరిగేషన్‌ అధికారులు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఈ హరికిషన్‌ తెలిపిన వివరాలు. చీకోడ్‌ గ్రామ శివారులోని పాశికుంట కట్టను ధ్వంసం చేసి దానికి ఆనుకొని ఉన్న భూములను కబ్జా చేశారు. ఇరవై నాలుగు ఎకరాల్లో కుంట ఆయకట్టు ఉంటుందన్నారు. సరిహద్దు గ్రామమైన రామక్కపేటకు చెందిన రాజేశ్వరి, మైసరాజులు ఈనెల 15న నలభై మీటర్ల పొడవున కట్టను ధ్వంసం చేసి కబ్జా చేశారు. ఇరిగేషన్‌ అధికారులు కట్టను పరిశీలించి కబ్జా చేసిన వారిపై పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.